ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 8 ఆగస్టు 2024








- అన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు
- సాఫ్ట్‌వేర్ కుటుంబీకులకూ పట్టాలు..
- గత వైసీపీ హయాంలో విచ్చలవిడిగా భూఅక్రమాలు
- కుణుతూరులో భూదోపిడీ పర్వం



# గుట్టలకు పట్టాలు

## కొండలు, గుట్టలు, చెక్‌డ్యాంలకు అసైన్డ్ పట్టాలు





సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేర్ల మీద ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దృశ్యం

**ధర్మవరం రూరల్, ఆగస్టు 7:** గత వైసీపీ హయాంలో భూఅక్రమాలు విచ్చలవిడిగా సాగాయి. అసైన్‌మెంట్ మాటున విచ్చలవిడిగా పట్టాలిచ్చేశారు. భూములకు రాసిచ్చి ఉంటే ఓకే.. కానీ, పెద్దపెద్ద కొండలను వైసీపీ నాయకులు, కార్యకర్తలకు రాసిచ్చేశారు. అడ్డదిడ్డంగా పట్టాలిచ్చేశారు. ఆఖరుకు చెక్‌డ్యాంను కూడా వదల్లేదు. చెక్‌డ్యాంను కూడా రాసిచ్చేశారు. ఇష్టారాజ్యంగా కొండలు, గుట్టలు, చెక్‌డ్యాంలను సైతం వైసీపీ నాయకులు సొంతం చేసుకున్నారు. యథేచ్ఛగా తమ పేర్లమీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని, భూదోపిడీ సాగించారు. వారి భూఅక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని కుణుతూరు గ్రామ పరిధిలో భూఅక్రమాలు అన్నీ ఇన్నీ కావు. కొండలు, గుట్టలు, చెక్‌డ్యాంలు వేటినీ వదలకుండా రాసిచ్చేశారు.

### అవాక్కవ్వాల్సిందే..

వైసీపీ హయాంలో సాగులో ఉన్న రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేశారు. దీనిని అదునుగా భావించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. ఆయా గ్రామాల సమీపంలో ఉన్న కొండలు, గుట్టల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. అప్పనంగా కొట్టేశారు. వాటి పత్రాలను బ్యాంకుల్లో పెట్టి వ్యవసాయ రుణాలు సైతం పొందారు. కుణుతూరు గ్రామంలో వాగులు, వంకలు, కొండలు, చెక్‌డ్యాంలు, రాళ్లగుట్టలను అసైన్‌మెంట్ కమిటీలో నమోదు చేసుకున్నారు. ఇందుకోసం తూతూమంత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేశారు. వాటిని కూడా గుట్టుచప్పుడు కాకుండా వైసీపీ నాయకుల కనుసన్నల్లో రెవెన్యూ అధికారులు నిర్వహించారు. కమిటీలో నాయకులు ఇచ్చిన పేర్లు పొందుపరిచి ఆమోదముద్ర వేశారు. ఈ కమిటీలో ఇచ్చిన పేర్లుగానీ, వారిపేరు ఉన్న సర్వే నంబర్లలో ఉన్న భూములనుగానీ పరిశీలిస్తే కంగుతినాల్సిందే. ఆ సర్వే నంబర్లలో కొండలు, గుట్టలు, చెక్‌డ్యాంలు దర్శనమిస్తాయి. వీటికి నాయకులు చెప్పిన పేర్లు నమోదు చేసి, ఆన్‌లైన్ చేశారు. అధికారం ఉందని, ఏదిచేసినా చెల్లుబాటు అవుతుందన్న ధోరణితో వైసీపీ నాయకులు వ్యవహరించగా.. వారికి అధికారులు వత్తాసు పలకడంతో భూదోపిడీ పర్వం యథేచ్ఛగా కొనసాగింది.

### ఏయే సర్వే నంబర్లలో పొందుపరిచారంటే..

కుణుతూరు గ్రామ సమీపంలోని కొండలు, చెక్‌డ్యాంలు, రాళ్లగుట్టలే అసైన్డ్ భూములుగా మార్చేశారు. సర్వే నంబర్లు 28, 20, 456, 436, 176, 138, 436-2లో సుమారు 120 ఎకరాల భూమిని అసైన్‌మెంట్‌లో పొందుపరిచారు. ఆ భూములను యథేచ్ఛగా వైసీపీ వర్గీయులు తమ పేర్ల మీద అసైన్‌మెంట్‌లో నమోదు చేసుకుని, ఆన్‌లైన్ చేయించుకున్నారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు సాగుకు అనువుగాలేని భూములను అసైన్‌మెంట్‌లో నమోదు చేశారు.

### వన్‌బీలు రావడంతో వెలుగులోకి..

కుణుతూరు గ్రామానికి సంబంధించి గత ప్రభుత్వంలో అసైన్‌మెంట్ కమిటీలో సుమారు 40మంది రైతులకుగాను 120 ఎకరాలకుపైగా అసైన్‌మెంట్ జరిగినట్లు రికార్డులో పొందుపరిచారు. అప్పటి రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా గ్రామసభలు కూడా నిర్వహించకుండానే అసైన్‌మెంట్‌ను అధికార పార్టీ నాయకులు చెప్పినట్లుగా ఓకే చేసేశారు. తర్వాత వచ్చిన రెవెన్యూ అధికారులు వీటిపై కసరత్తు ప్రారంభించారు. చాలామందికి భూములున్నాయనీ, కమిటీలో పొందుపరిచిన సర్వే నంబర్లు, భూములపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్ పక్కకు పెట్టేశారు. దీంతో అసైన్‌మెంట్‌లో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో వన్‌బీలు రాకుండా నిలిపివేశారు. వైసీపీ అధికారం కోల్పోవడంతో చేసేదిలేక ఆ గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, వారికి ఆమ్యామ్యాలు ముట్టజెప్పి, నిలిచిపోయిన అసైన్‌మెంట్ సర్వే నంబర్లకు మ్యూటేషన్ చేసి వన్‌బీలు వచ్చేలా డిజిటల్ సైన్‌లు ఇప్పించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వన్‌బీలు రావడంతో అక్రమార్కులు తమ పట్టాలు వచ్చాయంటూ రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగడంతో వాస్తవాలు బయటపడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన పలువురు రైతులు.. గత నెలలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని కలిసి భూఅక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేసి, అనర్హులను తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి సంబంధించిన కొండ, గుట్టలు, రాళ్లగుట్టల భూమిని రికార్డుల ప్రకారం ఉంచాలని డిమాండ్ చేశారు.

**కొండను రాసిచ్చేశారు..**


ఇది ధర్మవరం మండలం కుణుతూరు గ్రామ పరిధిలో ఉన్న రాళ్లగుట్ట కొండ. సర్వే నంబరు 28లో 14 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ కొండకు కూడా గ్రామానికి చెందిన ఏడుగురు అసైన్డ్ పట్టాలు పొందారు. ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో అసైన్‌మెంట్‌లో పేర్లు పొందుపరచుకుని, ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు.

**చెక్ డ్యాంను మింగేశారు..**

కుణుతూరు గ్రామ పరిధిలో ఈ చెక్ డ్యాం ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 20-3 సర్వే నంబరులో 11.74 ఎకరాల వంక పోరంబోకు భూమిలో ఈ చెక్ డ్యాం ఉంది. 50 ఏళ్లక్రితం 10 ఎకరాలు చెక్‌డ్యాం సమీపాన ఉన్న భూమిని అప్పట్లో కొంతమంది పేర్ల మీద ఆన్‌లైన్ ఎక్కించుకున్నారు. మిగిలిన 1.74 ఎకరాల వంకపోరుబోకు, చెక్‌డ్యాం ఉన్న భూమిని గత వైసీపీ హయాంలో అదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవి పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కించేశారు.



చెక్‌డ్యాం వంకపోరుబోకు భూమిని ఆన్‌లైన్‌లో లక్ష్మీదేవి పేరు మీద నమోదు చేసిన దృశ్యం



**ఇది.. సాగుభూమి అట..**

ఈ చిత్రంలో కనిపిస్తున్న రాళ్లగుట్ట కుణుతూరు పొలంలోని 436 సర్వే నంబరులో ఉంది. దీనిని అసైన్‌మెంట్‌లో పొందుపరచుకుని గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో ముగ్గురి పేర్ల మీద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

### సాఫ్ట్‌వేర్ల కుటుంబీకులకూ పట్టాలు

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న కుణుతూరుకు చెందిన వెంకటరామిరెడ్డి భార్య ఇంద్రాణి పేరుమీద సర్వే నంబరు 176లో రెండెకరాల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. టికే ప్రదీప్‌కుమార్‌రెడ్డి భార్య నర్మద పేరు మీద 176ఏగా సర్వే నంబరు సృష్టించి, అందులోని 2.05 ఎకరాలు అసైన్‌మెంట్‌లో పేర్లు పొందుపరుచుకుని ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని, వన్‌బీలు పొందారు. వీరి పేర్లు అసైన్‌మెంట్‌లో ఉన్నప్పటికీ వీరికి బహుమతి కింద నమోదు చేసి, ఆ భూములను ఫ్రీహోల్డ్ చేసేసి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అసైన్‌మెంట్‌లో పొందుపరచడంతో గ్రామస్థులు సైతం అవాక్కయ్యారు.

### నేలకోట, ఏలుకుంట్లలో భారీగా అవకతవకలు

అసైన్‌మెంట్ కమిటీలో నేలకోట, ఏలుకుంట్ల గ్రామాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా ఈ రెండు గ్రామాల సమీపంలోని కొండలు, గుట్టలను అసైన్‌మెంట్‌లో పొందుపరిచి ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని వన్‌బీలు పొందారు. కొండలు, గుట్టలకు సర్వే నంబర్లు సృష్టించి, 100 ఎకరాల వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పంచేశారు. ఈ ఉదంతంపై అప్పట్లో విమర్శలు రావడంతో అసైన్‌మెంట్‌లో ఉన్న భూములకు వన్‌బీలు రాకుండా అడ్డుకట్టవేశారు. రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెప్పి, వాటికి వన్‌బీలు వచ్చేలా చేశారన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.



**విచారణ చేపడతాం**

కుణుతూరులో అసైన్డ్ భూముల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ చేపడతాం. నూతన తహసీల్దార్ రాగానే విచారణ చేయిస్తాం. అనర్హులను తొలగించి, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతాం.

- వెంకటశివరామిరెడ్డి, ఆర్డీఓ, ధర్మవరం

---

# దరఖాస్తు చేసుకోండి

**కొత్తచెరువు ఆగస్టు 7:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సెప్టెంబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలన్నారు. పరీక్ష డిసెంబరు 8న నిర్వహిస్తారన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ ఎస్టీల వారు రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్‌లైన్ దరఖాస్తు గడువు సెప్టెంబరు 6వ తేదీతో ముగుస్తుందని ఆమె తెలిపారు. సెప్టెంబరు 10వ తేదీలోగా రుసుం చెల్లించాలన్నారు. దరఖాస్తుకు www.dse.ap.gov.in వెబ్‌సైట్‌లో, వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆమె వివరించారు.

# వైభవంగా గోదాదేవి జయంతి



తిరువీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

**కదిరి అర్బన్, ఆగస్టు 7:** పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి జయంతి వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం మొదటి బుధవారం పుబ్బ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభ అండాళ్ అమ్మవార్ల ఆస్థాన ఉత్సవాన్ని అర్చకులు ఘనంగా చేశారు. స్వామివారు ప్రత్యేకాలంకరణలో తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేయండి

## కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

**పుట్టపర్తి, ఆగస్టు 7:** స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను వేడుకలకు ఆహ్వానించాలన్నారు. ఈనెల 15న అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం ఉంటుందనీ, ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, ఏఎస్పీ విష్ణు పాల్గొన్నారు.

# అదనపు పోలీసు సిబ్బందిని నియమించండి

## హోంమంత్రి అనితను కోరిన మాజీ మంత్రి పల్లె



హోంమంత్రితో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

**పుట్టపర్తి, ఆగస్టు 7:** సత్యసాయిబాబా నడయాడిన పుట్టపర్తి నియోజకవర్గానికి ప్రాధాన్యమిస్తూ అదనపు పోలీసు సిబ్బంది, నూతన వాహనాలను మంజూరు చేయాలని హోంమంత్రి అనితను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కోరారు. వెలగపూడిలోని హోం మంత్రి కార్యాలయంలో ఆమెను పల్లె బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో సిబ్బంది, వాహనాల కొరత ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బందితోపాటు కొత్తవాహనాలను మంజూరు చేయాలని కోరారు. అనంతరం పురపాలక శాఖ మంత్రి నారాయణను కలిసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ విస్తరణ, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

# చేనేత వస్త్రాలను ధరించాలి

## జేసీ అభిషేక్ కుమార్



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

**పుట్టపర్తి, ఆగస్టు 7:** ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు.. చేనేత వస్త్రాలను ధరించి చేనేతలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను జేసీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చేనేతలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నేతన్నలను జేసీ సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, చేనేత జౌళి శాఖాధికారి రమేష్, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, చేనేత సంఘం నాయకులు పాల్గొన్నారు.

# చేనేతను కాపాడుకుంటాం

## పరిటాల శ్రీరామ్.. నేతన్న విగ్రహానికి నివాళి



చేనేత విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

**ధర్మవరం రూరల్, ఆగస్టు7:** చేనేతను కాపాడుకుంటామని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కదిరిగేట్ పక్కన ఉన్న చేనేత విగ్రహానికి పరిటాల శ్రీరామ్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ముందుగా చేనేత రంగానికి సేవలందించినవారికి, కార్మికులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి పరిటాలశ్రీరామ్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. కూ టమి ప్రభు త్వం.. చేనేతలను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలకృష్ణ, జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి పాల్గొన్నారు.

# రైతును ముంచిన నకిలీ..!

## మొలకెత్తని మొక్కజొన్న విత్తనం

## అన్నదాతకు సర్వం నష్టం

**హిందూపురం అర్బన్, ఆగస్టు 7:** అప్పుల ఊబిలో చిక్కుకున్న కరువు రైతును నకిలీ విత్తనాలు మరింత అగాధంలోకి నెట్టి వేస్తున్నాయి. ఫలానా కంపెనీ విత్తనాలు వేస్తే అధిక దిగుబడి వస్తుందని దుకాణదారులు.. రైతులను నమ్మించి, నట్టేట ముంచుతున్నారు. పట్టణంలోని కేఎల్ రోడ్డులో ఉన్న ఓ దుకాణంలో ప్రముఖ కంపెనీ పేరుతో మొక్కజొన్న విత్తనాలు విక్రయించారు. మండలంలోని చలివెందల గ్రామానికి చెందిన రైతులు శ్రీరామిరెడ్డి, నాగభూషణరెడ్డి మొక్కజొన్న సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. హిందూపురంలోని కేఎల్ రోడ్డులో ఉన్న విత్తనాల దుకాణానికి వచ్చారు. దుకాణ నిర్వాహకుడు.. ఓ కంపెనీ విత్తనాలు మంచి దిగుబడి ఇస్తాయని నమ్మించి, విక్రయించాడు. ఆ విత్తనాలను రైతులు తీసుకెళ్లి విత్తారు. వర్షం, బోరుబావి నీటితో తడులిచ్చారు. నెల రోజులు కావస్తున్నా మొలక కూడా రాలేదు. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా అప్పులు చేసి, విత్తనాలు కొనుగోలు చేశారు. అవి మొలకే ఎత్తకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీనిపై విత్తన దుకాణదారుడిని నిలదీస్తే.. 'విత్తనాల్లో లోపం లేదనీ, మీరే సరిగా విత్తలేదనీ, ఎరువులు వేయలేదనీ, నీరు కట్టలేదనీ, భూసారం లేదంటూ' బుకాయించాడు. చేసేదిలేక రైతులు బోరుమంటున్నారు. ఇప్పటికే విత్తనాలకు ఎకరాకు రూ.4500, దుక్కి దున్నేందుకు రూ.4 వేలు, ట్రాక్టర్, కూలీలు ఇతర ఖర్చులు మరో రూ.7 వేలు, ఉప్పు, మెన్యూరు తదితరాలకు మరో రూ.3వేలు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. ఇంతా చేస్తే పంట మొలక కూడా ఎత్తకతీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇలా.. నకిలీ విత్తనాలతో రైతులు కుదేలవుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. పలువురు అధికారులు.. దుకాణదారులు ఇచ్చే మామూళ్ల మత్తులో మునిగి చర్యలు చేపట్టట్లేదన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

**విచారణ చేసి, చర్యలు తీసుకుంటాం**

నకిలీ విత్తనాల విషయం మా దృష్టికి రాలేదు. రైతులు ఫిర్యాదు చేస్తే పొలాన్ని పరిశీలిస్తాం. నకిలీ విత్తనాలు అంటగట్టినట్లు తేలితే దుకాణదారుడిపై చర్యలు తీసుకుంటాం.

- సురేంద్రనాయక్, మండల వ్యవసాయాధికారి



మొలకెత్తని మొక్కజొన్న పంట



ఆవేదన చెందుతున్న రైతు

# పెద్దోళ్లను తప్పించారా?

- ఖరీదైన కార్లను వదిలేశారా?
- పేకాటరాయుళ్ల అరెస్టులో ఎన్నెన్నో అనుమానాలు
- స్టేషన్ వద్ద ఉన్న కారు రాత్రికి రాత్రే కర్ణాటకకు..
- పట్టుబడిన డబ్బు లెక్కలోనూ తేడాలున్నట్లు చర్చ



తప్పించిన వాహనం

**హిందూపురం, ఆగస్టు 7:** పెనుకొండ మండలంలో మూడ్రోజుల క్రితం పేకాట స్థావరంపై దాడి, నిందితుల అరెస్టుపై ఎన్నెన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలుకుబడి ఉన్న పెద్దలను పోలీసులు తప్పించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి వాహనాలను కూడా వదిలేసినట్లు పోలీసు శాఖలోనే చర్చ సాగుతోంది. పెనుకొండ వద్ద భారీ మొత్తంలో నగదు, కర్ణాటక రిజిస్ట్రేషన్ వాహనాలు పట్టుబడ్డాయి. పట్టుబడిన వాహనాలను బట్టి అక్కడ 40 మందికిపైగా పేకాట రాయుళ్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కర్ణాటక రిజిస్ట్రేషన్‌గల కార్లు 15 ఉన్నట్లు పోలీసు శాఖలో చర్చ సాగుతోంది. పోలీసులు కేసులో చూపింది ఐదింటినే. వాటిలో కూడా విలువైన వాహనాలు వదిలేసి, విలువ తక్కువ ఉన్న వాటిని చూపించిట్లు సమాచారం. అక్కడ పోలీసులు దాడి చేసినపుడు విలువైన పెద్దకార్లు నాలుగు నుంచి ఆరు ఉన్నట్లు తెలిసింది. వాటిలో ఉన్న వ్యక్తులు కూడా కర్ణాటకతోపాటు జిల్లాలో పలుకుబడి ఉన్నవారేననీ, వారితోపాటు వారి వాహనాలను సైతం పోలీసులు పంపించేసినట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు దాడి చేసినపుడు పదికిపైగా కార్లున్నాయనీ, సమావేశంలో మాత్రం ఐదే ఉన్నట్లు వెల్లడించడమే ఇందుకు నిదర్శనం. నాలుగు వాహనాల నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి, పంపించేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కార్లను తీసుకెళ్లినవారే చెబుతున్నట్లు ప్రచారం సాగుతోంది. పలుకుబడి ఉన్నవారు కావడంతో కొందరు ఒత్తిళ్లు తెచ్చి, మరికొందరు అడిగినంత సమర్పించుకుని అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఓ ఫార్చ్యూనర్ వాహనం పట్టుబడినట్లు ఆ రోజు సాయంత్రం పెనుకొండ స్టేషన్ వద్ద ఉంచారు. అదేరోజు ఆ వాహనాన్ని డ్రైవర్ కర్ణాటకకు తీసుకెళ్తుండగా పట్టుకోవాలని పక్క మండల పోలీసు అధికారికి తెలిపారు. తనకు వాహన డ్రైవింగ్ రాదనీ, దీంతో ఆపి ఉంటే ఎవరో ఎత్తుకెళ్లినట్లు పోలీసు అధికారిచెప్పడం విడ్డూరంగా ఉంది. దీనిని బట్టే పేకాట రాయుళ్లు, నిర్వాహకులకు పోలీసు అధికారులు ఏస్థాయిలో వత్తాసు పలికారో అర్థం చేసుకోవచ్చు.

**సమగ్ర విచారణ చేపడతాం**

పేకాట స్థావరం వద్ద పట్టుబడిన వాహనాలను తప్పించి ఉంటుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఏస్థాయి అధికారి ప్రమేయం ఉన్నా ఉపేక్షించేది లేదు. దీనిపై సమగ్ర విచారణ చేపడతాం. -రత్న, జిల్లా ఎస్పీ

# జిల్లాలో తేలికపాటి వర్షం

**పుట్టపర్తిరూరల్, ఆగస్టు 7:** జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా అమరాపురం 32.4 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. గోరంట్ల 28.4, సోమందేపల్లి 17.2, గుడిబండ 13.2, కదిరి 8.8, మడకశిర 8.6, ధర్మవరం 7.4, రామగిరి 5.6, నల్లచెరువు 5.2, కొత్తచెరువు 5.0, ముదిగుబ్బ, రొళ్ల, పరిగి 4.2 మిమీ, హిందూపురం 3.8, నల్లమాడ, పుట్టపర్తి 3.4, కనగానపల్లి, ఓబుళదేవరచెరువు, చిలమత్తూరు 3.2, బత్తలపల్లి, నంబులపూలకుంట 3.0, చెన్నేకొత్తపల్లి 2.4, గాండ్లపెంట 2.0, తనకల్లు 1.8, తలుపుల 1.6, బుక్కపట్నం 1.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖాధికారులు వివరించారు.



# పకడ్బందీగా పంట నమోదు చేయాలి

## జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

**ధర్మవరం రూరల్, ఆగస్టు 7:** ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల ఈ-క్రాపింగ్ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు.. సిబ్బందికి ఆదేశించారు. పట్టణంలోని సెరికల్చర్ కార్యాలయంలో ధర్మవరం డివిజన్‌లోని ఏఓలు, రైతుసేవాకేంద్రం సిబ్బందికి ఈ పంట నమోదుపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. ప్రతి పంట నమోదు చేయాలన్నారు. తప్పిదాలకు తావివ్వకుండా సకాలంలో పూర్తిచేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య, ఏఓలు ముస్తఫా, రమాదేవి, ఓబిరెడ్డి, కృష్ణకుమారి, మురళి పాల్గొన్నారు.

## పల్మనరీ విభాగానికి ఐదు పీజీ సీట్లు



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌కు అభినందనలు తెలుపుతున్న పల్మనరీ విభాగం వైద్యులు

**అనంతపురం టౌన్, ఆగస్టు 7:** జిల్లా బోధనాస్పత్రిలోని పల్మనరీ విభాగానికి కొత్తగా ఐదు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఆమేరకు జాతీయ వైద్యమండలి నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చినట్లు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. ఇప్పటి వరకు వైద్యకళాశాలలో 112 పీజీ సీట్లు ఉండగా కొత్తగా వచ్చిన ఐదు సీట్లతో ఆ సంఖ్య 117కి చేరిందని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. పల్మనరీ విభాగానికి కొత్తగా పీజీ సీట్లు మంజూరుకావడంతో ఆ విభాగం వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

## పశుగణన పక్కాగా చేయాలి

### పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం

**అనంతపురం అర్బన్, ఆగస్టు 7:** జిల్లా వ్యాప్తంగా పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. బుధవారం స్థానిక పశుసంవర్ధక శాఖ అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు పశుగణన చేయడంపై శిక్షణ ఇచ్చారు. జేడీ మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు నెలాఖరుదాకా 21వ భారత పశుగణన సర్వే చేయాలన్నారు. జిల్లాలోని గృహాలు, సంస్థల వద్ద ఉన్న అన్ని జాతుల పశువుల వివరాలను ప్రభుత్వం తయారు చేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా ఎంపికైన అధికారు లు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.

## చీనీ కాయలు టన్ను రూ.19వేలు

**అనంతపురం రూరల్, ఆగస్టు 7:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.4,500లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 837టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## టమోటా కిలో రూ.25

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 3వేల టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

## ఐటీఐ ప్రవేశాలకు మూడో విడత దరఖాస్తులు

**అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7:** ఉమ్మడి జిల్లాలోని ఐటీఐ కళాశాలలో మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు మూడో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. 28లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులు వారికి నచ్చిన కళాశాలలను ఆన్‌లైన్‌లోనే ఎంచుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తుచేసుకున్న వారికి 29న ప్రభుత్వ, 31న ప్రైవేట్ ఐటీఐ కళాశాలలకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## స్పాట్ బిల్లింగ్‌కు టెండర్ల ఆహ్వానం

**అనంతపురంరూరల్, ఆగస్టు 7:** ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో స్పాట్ బిల్లింగ్ నిర్వహణకు టెండర్ల ప్రక్రియ బుధవారం నుంచి మొదలైంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని సబ్ డివిజన్ల వారీగా టెండర్లను ఆహ్వానించారు. ఉమ్మడిజిల్లాలో 22సబ్‌డివిజన్లు ఉన్నాయి. వీటిలో సీకేపల్లి, ధర్మవరం, అనంతపురం ఈస్ట్ డివిజన్లను ఎస్సీ, ఎస్టీకు రిజర్వు చేశారు. ఈనెల 22వ తేదీ టెండర్ల దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించారు. ఆశావహులు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు దాఖలు చేసుకోవాలని సంబంధిత అధికారులు వెల్లడించారు.

### ఆటోపైకి దూసుకొచ్చిన లారీ

## యువకుడి దుర్మరణం



బోల్తాపడిన టమోటా లారీ, మృతిచెందిన శివానంద



**గార్లదిన్నె, ఆగస్టు 7:** మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న ఆటోను టమోటా లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శివానంద (22) మృతిచెందాడు. కేశవాపురం గ్రామానికి చెందిన శివ, రమేష్, ముంటిమడుగుకు వంశీ, అనిల్ హమాలీ పనినిమిత్తం మంగళవారం సాయంత్రం కల్లూరుకు వెళ్లారు. పనిముగించుకుని టీ తాగడానికి అర్ధరాత్రి కల్లూరు హైవే పక్కన ఉన్న టీ స్టాల్ వద్దకు వెళ్లారు. అయితే రమేష్, వంశీ ఆటో దిగి టీ తాగుతుండగా అనిల్, శివానంద ఆటోలోనే ఉన్నారు. మదనపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టమోటా లారీకి వ్యక్తి అడ్డురావడంతో తప్పించబోయి టీస్టాల్ ముందున్న ఆటోపైకి వేగంగా దూసుకొచ్చి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న అనిల్ ఎగిరపడగా శివానంద అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. జాతీయ రహదారిపై రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న శివానంద కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు బడి ఎన్నికలు

- జిల్లాలో 1741 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎలక్షన్స్
- ఓటు వేయనున్న 2,01,108 మంది విద్యార్థుల తల్లిదండ్రులు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- సజావుగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం



యాడికిలో గతంలో పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

**అనంతపురం విద్య, ఆగస్టు 7:** జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1741 స్కూళ్లలో ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు దిగడంతో కొన్ని చోట్ల సమస్యాత్మకంగా, వివాదాలకు కేంద్రంగా మారాయి. అయితే ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకూ 2.01 లక్షల మంది విద్యార్థులు చదువుతు న్నారు. వారి తల్లిదండ్రులు ఓటర్లుగా ఓటును వినియోగించుకోనున్నారు.

### ఎస్ఎంసీ కీలకం

స్కూళ్లలో ఎస్ఎంసీలు కీలక పాత్ర పోషిస్తాయి. స్కూల్‌లోని తరగతుల నిర్వహణ, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. స్కూల్‌లోని విద్యార్థుల తల్లి లేదా తండ్రికి ఓటు హక్కు ఉంటుంది. ఎన్నికల్లో పాఠశాలలోని ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రుల ను లేదా సంరక్షకులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ఎన్నికైన సభ్యుల్లోంచి ఎస్ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఎక్స్ అఫిషియో సభ్యులు, కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుంది. జిల్లాలో జడ్పీ, ఎంపీపీ స్కూళ్లు 1481, మున్సిపల్ స్కూళ్లు 152, కేజీబీవీలు 32, ఎయిడెడ్ స్కూళ్లు 23, స్టేట్ గవర్నమెంట్ స్కూళ్లు 16, మోడల్ స్కూళ్లు 15, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 11, ట్రైబల్‌వెల్ఫేర్ స్కూళ్లు 6, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 4, బీసీ వెల్ఫేర్ స్కూల్ 1, రైల్వే స్కూల్ 1 ఉన్నాయి. వీటి పరిధిలోని ఎస్ఎంసీలకు గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు.

### గతంలో రాద్ధాంతం...

గతంలో ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా స్కూళ్లలో వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు దిగారు. 2021లో ఎన్నికలు నిర్వహించారు. చాలా చోట్ల బలవంతంగా కూడా ఎస్ఎంసీలను సొంతం చేసుకునేలా వైసీపీ మూకలు చెలరేగాయి. పాఠశాలలో ప్రశాంతంగా సాగాల్సిన ఎన్నికలకు అప్పటి వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులిమారు. ఎన్నికైన కమిటీల రెండేళ్ల పదవీ కాలం ముగియగానే అప్పటి ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. కొత్త ప్రభుత్వం రావడంతో...ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు జారీ చేసింది.

### కసరత్తు పూర్తి

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1741 స్కూళ్లలో ఎన్నికల నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే రోజు స్కూళ్లలో నోటీస్ బోర్డుల్లో జాబితా ప్రదర్శించారు. 1741 స్కూళ్లలో 2.01 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, వారి తల్లి లేదా తండ్రి ఓటురుగా ఉంటారు. ఈ నెల 5న స్కూళ్లలో ఓటరు జాబితా ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించారు. అదే రోజు ఓటర్ల తుది జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. గురువారం మధ్యాహ్నం 1 గంటలోపు స్కూళ్లలో ఎస్ఎంసీ సభ్యులు, ఎస్ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలలోపు ప్రమాణస్వీకారం చేయించి 3 గంటల్లోపు ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహిస్తారు.

### పారదర్శకంగా ఎన్నికలు: నాగరాజు, ఏపీసీ, సమగ్రశిక్ష



స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. గురువారం 1741 స్కూళ్లలో ఎన్నికలు జరగనున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎంపీడీఓలు, ఎమ్మార్వోలు, పోలీసుల సహకారం కూడా తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించాం. మధ్యాహ్నం 1 గంటలకు ఎన్నికలు పూర్తికాగానే...3 గంటలకు కొత్త కమిటీలతో తొలి సమావేశాలు నిర్వహిస్తాం.

## ఎస్ఎంసీ ఎన్నికల్లోనూ ప్రలోభాలు

### గజరాంపల్లిలో వెల్లువెత్తుతున్న ఆరోపణలు



**పామిడి, ఆగస్టు 7:** స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లోనూ ప్రలోభాల పర్వ కొనసాగుతోంది. మండలంలోని గజరాంపల్లి గ్రామ ఎస్ఎంసీ ఎన్నికలు వివాదానికి దారి తీస్తున్నాయి. ఎలాగైనా ఎస్ఎంసీ ఛైర్మన్ పదవి చేజిక్కించుకోవాలని కొందరు వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు డబ్బులు పంచినట్లు ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఈ పాఠశాలలో మొత్తం 38 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో 1వ తరగతిలో 13మంది, 2వ తరగతి లో ఆరుగురు, 3వ తరగతిలో ఎనిమిది మంది, 4వ తరగతిలో ముగ్గురు, 5వ తరగతిలో ఎనిమిది మంది ఉన్నారు. అయితే ఈ ఎన్నికలను వాయిదా వేయాలని ఎంఈఓ జయానాయక్‌కు కొందరి నుంచి వినతిపత్రం అందినట్లు సోషల్ మీడియాలో ఓ పోస్టు చక్కర్లు కొట్టింది. ఈ విషయంపై ఎంఈఓను అడగ్గా తనకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఎస్ఎంసీ ఛైర్మన్ కోసం ఓ పార్టీ నాయకులు ప్రలోభపెట్టినట్లు మాత్రం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఎన్నికలపై ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

## సీఎం సానుకూల స్పందన హర్షణీయం

### వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యలపై ఓబులు

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 7:** సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించడం హర్షణీయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్ వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యల గురించి ప్రస్తావించగా సత్యసాయి స్కీంకు నిధులు కేటాయించి, సక్రమంగా నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారన్నారు. 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న వాటర్‌వర్క్స్ కార్మికులు అనేక సమస్యలెదుర్కొంటూ వస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాలుగు నెలలకోసారి సమ్మెలు, నిరసనలు తెలిపితేగానీ కార్మికుల బకాయి వేతనాలు వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. దీనిపై గత నెలలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందించి సమస్యలు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ తరుణంలో కార్మికుల సమస్యలపై అనంత కలెక్టర్ ప్రస్తావనకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదేవిధంగా కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు.

## ఈ క్రాపింగ్ పకడ్బందీగా చేయాలి

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

**అనంతపురం అర్బన్, ఆగస్టు 7:** జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాపింగ్ పకడ్బందీగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బందితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిజమైన సాగుదారులను గుర్తించి ఈ క్రాపింగ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ క్రాపింగ్‌లో నమోదైన వివరాల ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట దిగుబడుల కొనుగోలు, ఇతర పథకాలు వర్తింపజేయడం వంటివి చేస్తామన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించి పంట సాగు చేసిన ప్రతి ఒక్కరు పంట నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వ రమ్మ పాల్గొన్నారు.

## చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

### చేనేత, జౌళిశాఖ ఏడీ అప్పాజి




మాట్లాడుతున్న ఏడీ అప్పాజి

**అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7:** అంతర్జాతీయ చేనేత ఉత్పత్తుల వినియోగతంతో స్థానిక చేనేత కార్మికులు నష్టపోతారని జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ అప్పాజి అన్నారు. అందుకే జాతీయ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. కృష్ణకళా మందిరంలో బుధవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. చేనేత కుటుంబాల ఆర్థిక సాధికారిత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పథకాలను అమలు చేస్తున్నాయని అన్నారు. ముద్ర రుణాల ద్వారా కార్మికులను ఆదుకుంటున్నాయని అన్నారు. ముడి పదార్థాల సరఫరా పథకం కింద నాణ్యమైన నూలు, మిశ్రమాలను అందజేస్తున్నామని తెలిపారు. ఒక్కో పాసు పుస్తకంపై 15 శాతం రాయితీతో ఆరు కిలోల శిల్క్ నూలు, చిన్నక్లస్టర్ల అభివృద్ధి పథకం ద్వారా 90 శాతం ప్రభుత్వ వాటాతో మగ్గం పరికరాల పంపిణీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా నెలకు రూ.4 వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత కార్మికులకు సూచించారు. అనంతరం చేనేత వృత్తిలో విశేష ప్రతిభ కనబర్చిన కార్మికులను సత్కరించారు. చేనేత, జౌళిశాఖ డీఓ బసవరాజు, ఏడీఓలు పూల శ్రీనివాసులు, నరసింహారెడ్డి, మురళీమోహన్, నాబార్డు డీడీఎం అనురాధ, డీసీఓ అరుణకుమారి, ఎల్‌డీఎం నర్సింగరావు, సిరికల్చర్ ఆఫీసర్ ఆంజనేయులు, ఫిషరీస్ డీడీ శ్రీనివాస నాయక్, ఆప్కో డీఎంఓ మధుబాబు పాల్గొన్నారు.

# గాలి సోకితే గల్లంతే !

- గాలికుంటు వ్యాధితో మూగజీవాల మృత్యువాత
- తీవ్రంగా నష్టపోతున్న కాపరులు



**నంబులపూలకుంట, ఆగస్టు 7:** వాతావరణ మార్పులతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. వ్యవసాయంలో నష్టాలు రావడంతో చాలామంది జీవనోపాధి కోసం గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం చేపట్టారు. అయితే వీటికి గాలికుం టు వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. దీంతో కాపరులు లబోదిబోమంటు న్నారు. మండలంలో 1.6లక్షల గొర్రెలు, పొట్టేళ్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఉన్నఊరిని, ఇండ్లను వదిలి వేళలేక, చాల కుటుంబాలు గ్రామాల్లోనూ ఉంటూ, గొర్రెలు, పొట్టేళ్ల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు.

### పొట్టేళ్ల పెంపకంపై శ్రద్ధ

సాధారణంగా కాపరులు గొర్రెలను మంద పెంపనకు ఉపయోగించుకుని పొట్టేళ్లను జీవనానికి విక్రయిస్తుంటారు. అందుకే తక్కువ సమయంలోనే ఎక్కు వ లాభాలు తెచ్చే పొట్టేళ్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. పొటేలు కండ పట్టడానికి ఉలవలు, మొక్కజొన్న, బియ్యం, పాలు తదితర పౌష్టికాహారం అందిస్తారు. ఈ ఏడాది పొట్టేళ్లకు గాలికుంట వ్యాధి సోకడంతో కాపరుల ఆశలు అడియాశలయ్యాయి. వ్యాధి సోకిన జీవాలకు పశువైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసి వెళ్తున్నారు. పశువైద్యశాలల్లో మందులు లేకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో రూ. వేలు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నట్లు కాపరులు వాపోతున్నారు. ఎన్ని మందులు వాడినా రోగం మాత్రం తగ్గడం లేదని కాపరులు ఆవేదన చెందుతున్నారు.

### ముక్కు మూతిలో పసరు వస్తే అంతే

గాలికుంటు వ్యాధి సోకిన జీవాలకు ముందుగా కాలిగిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. దీంతో జీవాలు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వెంటనే మూతి నుంచి జొల్లు కారుతుంది. నోటిలో కూడా పుండ్లు ఏర్పడి మేత మేయలేవు. దీంతో జీవాలు నీరసించి, కూలబడిపోతాయి. వాటిని బయటకు తీసుకెళ్లే వీలు లేక దొడ్డిలోనే ఉంచి వైద్యం అందించాల్సి ఉంటుంది. ముక్కు, మూతినుంచి పసరు వచ్చిందంటే ఇక వాటిపై ఆశలు వదులుకోవాల్సిందే. గాలికుంటు వ్యాధితో చనిపోయిన జీవాల మాంసాన్ని కూడా ఎవరూ కొనుగోలు చేయరు. దీంతో కాపరులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

### దోమలతోనే...

గాలికుంటు వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని పశువైద్యులు చెబుతున్నారు. అందుకే కాపరులు వ్యాధి సోకకముందే జీవాలకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచిస్తున్నారు. దొడ్లోగానీ, పశుగ్రాసానికి వెళ్లిన సమయంలో గ్రాసం పైన ఉండే దోమలు కాటు వేయడం వల్ల వైరస్ వ్యాప్తి చెందుతుందని వారు వెల్లడించారు. వైరస్ వలన నోటిలో ఏర్పడిన పుండు మానితే తప్ప జీవాలు మేత మేయలేని పరిస్థితి. వైరస్ సోకినప్పుడు ప్రతి మూగజీవానికి కాలిగిట్టలు, నోటిలో పుండ్లను ప్రతి రోజు శుభ్రం చేసి, మందులు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం బీమాను సద్వినియోగం చేసుకుంటే కొంతవరకూ ప్రయోజనం ఉంటుందని వారు పేర్కొన్నారు.

### పది పొట్టేళ్లు చనిపోయాయి



70 పొట్టేళ్లను జత రూ.18వేలతో మూడు నెలల కిందట కొనుగోలు చేశా. ఎండకాలంలో గ్రాసం కొనుగోలు చేసి, పొట్టేళ్లను మేపా. ఈవారం రోజుల్లో గాలికుంటు వ్యాధి సోకి పది పొట్టేళ్లు చనిపోయాయి. దాదాపు రూ.1.2లక్షలు నష్టం వాటిల్లింది. ప్రతిరోజు ఉదయం వ్యాధిసోకిన జీవాలకు పుండ్లు శుభ్రం చేస్తున్నాం. వాటిని చూసిన తర్వాత ఇంటి కెళ్లి అన్నం తిందామంటే తినబుద్ధి కావడం లేదు.

- బండి నాగముని, బందారుచెట్లపల్లి

### అప్పు ఎలా తీర్చేది..



రూకలకు గొర్రెలు తోలుకున్నా. గత పదిరోజులుగా అమ్మడానికి సిద్ధంగా ఉన్న పొట్టేళ్లు పది చనిపోయాయి. మందుల ధరలు అధికంగా ఉన్నాయి. ప్రైవేటు మందుల షాపుల్లో రూ.30వేలు అప్పు చేసి మందులు తెచ్చి వేశా. ఎండకాలంలో రూ.1.2లక్షలు ఖర్చు చేసి వేరుశనగ కట్టెను కొనుగోలు చేసి జీవాలకు వేశా. ఇంత పెట్టుబడి పెట్టి జీవాలను సంరక్షిస్తుంటే ఒక్కొక్కటి ఇలా చనిపోతే చేసిన అప్పులు ఎలా తీర్చేది.

- చిన్న నరసింహులు, ఎగువపల్లి

### వ్యాక్సిన్ ఒక్కటే మార్గం

గాలికుంటు వ్యాధి మూగజీవాలకు దోమల వలన వ్యాప్తి సోకుతుంది. ఇందుకు వ్యాక్సిన్ ఒక్కటే మార్గం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలి. ఈవ్యాధి సోకిన వాటికి నోరు, కాలి గిట్టలను శుభ్రం చేయాలి.


- బాలనాయక్, పశువైద్యాధికారి

# ఎంవీ రమణ కన్నుమూత

- విద్యార్థి దశ నుంచి ఉద్యమబాట
- సీపీఐ సంతాపం




ఎంవీ రమణ భౌతిక కాయం వద్ద సీపీఐ నాయకుల నివాళి



**అనంతపురం విద్య, ఆగస్టు 7:** జిల్లాకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మాలపాటి వెంకటరమణ (82) వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి కన్నుమూశారు. అనంతపురం నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో వారం రోజులుగా ఆయన చికిత్స పొందుతున్నారు. ఎంవీ రమణ మృతి పట్ల పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంతాపం తెలిపారు. ఏఐఎస్ఎఫ్‌లో చేరినప్పటి నుంచి అనేక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఆయనను కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఎంవీ రమణ కుటుంబ సభ్యులకు సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపం తెలిపారు. బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లెకు చెందిన ఆయన విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ చదువుతున్న సమయంలోనే ఉద్యమాల వైపు అడుగులు వేశారు. ఏపీ చరిత్రలో నిలిచిన విశాఖ ఉక్కు ఉద్యమానికి ఆయన కన్వీనర్‌గా పనిచేశారు. తర్వాతి కాలంలో సీపీఐ కళ్యాణదుర్గం తాలూకా కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా సేవలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర సమితి ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్నారు. పార్టీ నాయకులు సదాశివన్, నీలం రాజశేఖర్ రెడ్డి, వీకే ఆదినారాయణ రెడ్డి, పీఎస్ శర్మ, బంగి ఎర్రిస్వామి నాయకత్వంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేశారు. ఆయన మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, పార్టీ నాయకులు ఎండీ సంజీవప్ప, రాజారెడ్డి, కేశవరెడ్డి, లింగమయ్య, రమణయ్య, శ్రీరాములు, గోపాల్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలను గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తామని కుమారుడు వేణుగోపాల్ తెలిపారు. ఎంవీ రమణ భౌతిక కాయాన్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ కార్యాలయానికి తరలిస్తామని, అక్కడి నుంచి అంతిమయాత్ర మొదలౌతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## జీడిపల్లికి కృష్ణా జలాల విడుదల



రాగులపాడు వద్ద రెండు పంప్‌లతో కాలువకు విడుదల అవుతున్న నీరు

**ఉరవకొండ, ఆగస్టు 7:** కృష్ణా జలాలలు జీడిపల్లి రిజర్వాయర్‌కు విడుదలయ్యాయి. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీనీవా కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల ఒకటిన కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని వదలగా, మంగళవారం రాత్రి పంప్‌హౌస్ వద్దకు చేరుకున్నాయి. రెండు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువకు వదిలారు. 565క్యూసెక్కుల దాకా నీటిను ఎత్తిపోస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాలువకు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నిండుకుండలా తుంగభద్ర జలాశయం

**బొమ్మనహాళ్, ఆగస్టు 7:** తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం నాటికి 30,208 క్యూసెక్కుల నీరు జ లాశయంలోకి వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో 10 క్రస్ట్ గేట్లు రెండు అడుగులు, మరో 10 గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 60,211 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో బుధవారం సాయంత్రం నాటికి 1632.50 అడుగులతో 103.780 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 వ కి.మీ. వద్ద 1340 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

## గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

**గుంతకల్లు, ఆగస్టు 7:** తమిళనాడులోని వెలంకనిమాత ఉత్సవాలను పురస్కరించుకుని బాంద్రా-వెలంకని (వయా గుంతకల్లు) మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. బాంద్రా-వెలంకని (09093) ప్రత్యేక రైలు ఈనెల 27, సెప్టెంబరు 6 తేదీల్లో, రాత్రి 9-20 గంటలకు బాంద్రాలో బయలుదేరి రెండవరోజు ఉదయం ఎనిమిదిన్నరకు వెలంకనికి చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణపు రైలు (నెం. 09094) ఈనెల 29, సెప్టెంబరు 8వ తేదీన వెలంకనిలో రాత్రి 10 గంటలకు బయలుదేరి రెండవరోజు మధ్యాహ్నం 3 గంటలకు బాంద్రాకు చేరుతుందన్నారు. ఈ రైలు బోరివేలి, పన్వేల్, లోనవాలా, పూనా, డౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, క్రిష్ణా, రాయచూరు, గుంతకల్లు, కడప, రేణిగుంట, కాట్పాడి, వెల్లూరు కంటోన్మెంటు, తిరువన్నమలై, విల్లుపురం, చిదంబరం, సిర్కాజి, తిరువన్నూరు, నాగపట్టణం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

## బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మస్తాన్



**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 7:** బీసీ సంక్షేమశాఖ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చిలకల మస్తాన్ ఎన్నికయ్యారు. బుధవారం అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో ఆయన 50 ఓట్లతో గెలుపొందారు. కర్నూలు, ప్రకాశం, కడప జిల్లాల నుంచి రేసులో పలువురు వార్డెన్లు పోటీ పడగా మస్తాన్‌కు 50 ఓట్లు అదనంగా రావడంతో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.




అలంకరణలో గంగమ్మ తల్లి, కలశాలతో గ్రామస్థుల ఊరేగింపు

## వైభవంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

**ధర్మవరం రూరల్, ఆగస్టు 7:** మండలంలోని కుణుతూరులో నూతన ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో భాగంగా వేదపండితులు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉరుములు, వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామస్థులు కలశాలు, మకరతోరణం, బోనాలతో మహిళలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి దంపతులు, ఆలయకమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి

**ధర్మవరం రూరల్, ఆగస్టు 7:** మండలంలోని చింతలపల్లి, వసంతపురం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులను టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేష్ చౌదరి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో ఉపాధి మీ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి హామి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులకు తోడ్పాటు అందించాలని కోరారు. ఉపాధి పనులను కూలీలంతా పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నారా పురుషోత్తం, బట్టాపెద్దకాటమయ్య, నరేంద్రచౌదరి, అశ్వత్థనాయుడు, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, ఫీల్డ్‌అసిస్టెంట్ నారారామకృష్ణ, పెద్దచక్కెరయ్య, వెంకటేశ్వరచౌదరి పాల్గొన్నారు.

## బాలికలకు క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్డీ

**బత్తలపల్లి ఆగస్టు 7:** స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో బుధవారం ఏరియా బాలికల అథ్లెటిక్స్ నిర్వహించారు. బత్తలపల్లి ఏరియ నుంచి మూడు టీములు, ముదిగుబ్బ ఏరియా నుంచి ఐదు టీములు పాల్గొన్నాయి. బత్తలపల్లి ఏరియా నుంచి 60 మీటర్ల పరుగు పందేంలో దస్తగిరమ్మ, వంద మీటర్ల పరుగు పందేంలో ఉషారాణి, 200 మీటర్ల పరుగు పందెంలో పూజిత, లాంగ్ జంప్‌లో జస్విత, షాట్‌పుట్‌లో కాంచన ప్రథమ బహుమతి సాధించారు. ముదిగుబ్బ ఏరియా నుంచి 60 మీటర్ల పరుగులో హేమావతి, 100 మీటర్ల పరుగులో లత, 200 మీటర్ల పరుగులో ఇన్యావతి, షాట్‌పుట్ రూపా, లాంగ్ జంప్‌లో శరన్య ప్రథమ బహుమతులు సాధించారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల వీరికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ రుక్మాంగద, సిబ్బంది పాల్గొన్నారు.

## షాదీమహాల్ పరిశీలన



షాదీమహాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 7:** స్థానిక షాదీమహాల్‌ను బుధవారం అధికారులు, టీడీపీ నాయకులు పరిశీలించారు. షాదీమహాల్ మరమ్మతులకు గురికావడంతో మైనార్టీ టీడీపీ నాయకులు, పీఆర్ జేఈ జానకిరామ్‌తో కలిసి వెళ్లి పరిశీలించారు. మరమ్మతులకు నిధులు ఎంత ఖర్చు అవుతాయని పరిశీలించారు. ఎమ్మెల్యే నిధులతో షాదీమహాల్ మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మైనార్టీ జౌలి బాబా, తుమ్మల మహబూబ్‌బాషా, పొగాకు షబ్బీర్, మండోజీ ఆర్ఫీఖాన్, మండెం చాంద్‌బాషా, చికెన్ షానూ, డీలర్ బాబు, సొదీ నాగరాజు, కంచి సురేష్, మత పెద్ద అల్లాబక్ష పాల్గొన్నారు.

## ఉపాధి పనుల తనిఖీ



నిమ్మలకుంట వద్ద ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ

**ధర్మవరం రూరల్, ఆగస్టు 7:** మండలంలోని నిమ్మలకుంటలో ఉపాధి పథకం కింద జరుగుతున్న చింతనిశ్చింత తోపులో చింతచెట్లు చుట్టూ తవ్వుతున్న నీటి నిల్వ కందకాల పనులను జిల్లా డ్వామా పీడీ విజయప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులను కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న నీటి నిల్వ కందకాల వల్ల వర్షపు నీటిని ఆదా చేసుకోవచ్చుని, చింతచెట్లు ఏపుగా పెరిగి ఆదాయం వస్తుందని అన్నారు. ఇలాంటి పనులను విరివిగా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏ పనిచేసినా కొలతల ప్రకారం పనిచేస్తేనే పూర్తి కూలీ వస్తుందన్నారు. పండ్లతోటల పెంపకానికి ఉపాధిహామీ పథకం ఎంతో ప్రోత్సాహం అందిస్తుందని, రైతులంతా పండ్లతోటల పెంపకాన్ని చేపట్టాలని అన్నారు. ఆయన వెంట ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రకళ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

### రోడ్డుభద్రతపై అవగాహన

**నల్లమాడ:** మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యార్థులు, ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. కదిరి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధన లను ప్రతి ఒకరూ తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

**నంబులపూలకుంట:** నంబులపూలకుంట గ్రామశివార్లలో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. వారి నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

# మినీ గోకులాలకు దరఖాస్తుల వెల్లువ

● రైతుల్లో ఆనందం ● పశువుల హాస్టళ్ల మంజూరుకు వినతి ● అన్నింటినీ ఐదేళ్లు అటకెక్కించిన వైసీపీ




గత టీడీపీ పాలనలో నిర్మించిన మినీ గోకులం, పెద్దపల్లి వద్ద కొట్టంలో కట్టేసిన పాడి పశువులు

**తనకల్లు, ఆగస్టు 7:** వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా రైతులు పాడి పరిశ్రమ, చిన్నజీవాల పెంపకంపై దృష్టి సారించారు. ఇవి వ్యవసాయం కంటే లాభసాటిగా ఉండడంతో పలువురు రైతులు ఆ వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో గతంలో టీడీపీ ప్రభుత్వం పాడి, చిన్నజీవాల రైతులను ఆదుకోవాలన్న సదుద్దేశంతో 90 శాతం సబ్సిడీతో మినీగోకులాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. అప్పట్లో మండలవ్యాప్తంగా అనేక మంది రైతులు మినీ గోకులాల షెడ్లను నిర్మించుకున్నారు. ఇవి రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. మండలంలోని పెద్దపల్లి, రతిసేనాయక్‌తండా గ్రామాల వద్ద పశువుల హాస్టల్ నిర్మాణానికి రెవెన్యూ శాఖ భూమిని కేటాయించింది. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాలన్నింటినీ ఐదేళ్లపాటు అటకెక్కించింది. దీంతో రైతులు ప్రభుత్వ ప్రోత్సహం లేక మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 60 రోజుల్లోనే మినిగోకులాలను మంజూరు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన మినీ గోకులాలను చూసిన పలువురు రైతులు నేడు మినీగోకులాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందుకొస్తున్నారు. ఇప్పటికే 60కిపైగా దరఖాస్తులు సంబంధితాధికారులకు అందినట్లు సమాచారం. ఇంకా వందలాదిమంది రైతులు దరఖాస్తులు చేసుకోవడానికి సంబంధిత ధ్రువపత్రాలను సమకూర్చుకోవడంలో నిమగ్నమయ్యారు. మినీ గోకులాలతో పాటు మండలంలో పశువుల హాస్టల్‌ను కూడా మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

### మంజూరు చేయడం సంతోషం



ప్రభుత్వం అధికారం చేపట్టిన 60 రోజుల్లో పాడి, చిన్నజీవాల పెంపకంపై వైపు రైతులను మళ్లించడానికి మినీ గోకులాలను 90 శాతం సబ్సిడీతో మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. మండలానికి తక్కువ యూనిట్లు మంజూరు కావడం ఒకింత ఇబ్బందిగా ఉన్నా, వచ్చే ఐదేళ్లలో రైతులందరికి మినీ గోకులాలు తప్పకుండా మంజూరు కావచ్చు.

-సూర్యనారాయణరెడ్డి, పాడిరైతు, పెద్దపల్లి

### పశువుల హాస్టల్ మంజూరు చేయండి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 60 రోజుల్లోనే పాడి రైతులను, చిన్నజీవాల రైతులను ఆదుకోవడానికి మినీ గోకులాలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయం. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. మినీగోకులాలతో పాటు పశువుల హాస్టల్‌ను కూడా ప్రభుత్వం మంజూరు చేయాలి.

- ఉపేంద్రరెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు

### మినీ గోకులాలకు డిమాండ్

ప్రభుత్వం మినీ గోకులాలు మంజూరు చేయడం శుభపరిణామం. అయితే మండలానికి 35 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో 18 యూనిట్లు ఎస్సీ, ఎస్టీకు కేటాయించింది. మిగిలిన 17 యూనిట్లకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. మినీగోకులాల కోసం పోటీ ఎక్కువగా ఉంది. ప్రభుత్వం మరిన్ని యూనిట్లు మంజూరు చేస్తే రైతులందరికి లబ్ధి చేకూరుతుంది.

-హరినాథ్‌రెడ్డి,పశువైద్యాధికారి, తవళం

## ఈ-పంట నమోదుపై అవగాహన

**నంబులపూలకుంట:** స్థానిక ఏఓ కార్యాలయంలో బుధవారం ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ నరేంద్రకుమార్, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... పంటలు సాగుచేసిన ప్రతి రైతు వచ్చే నెల 15 లోపు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి అందాల్సిన పంట నష్టపరిహారం, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తించవన్నారు. ఈపంట నమోదుకు జాయింట్ అజమాయిష్ రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఓ, సర్వేయర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బంది సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓలు, సర్వేయర్లు ఉన్నారు.

### 117 జీవోను రద్దు చేయండి

**నంబులపూలకుంట:** ప్రాథమిక పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసే 117 జీవోను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవోను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేసినా నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ జీవోను రద్దుచేసిన తరువాతనే ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రామాంజులు, రమణనాయక్, వెంకటేవ్వర్లు, మురళి, సందీప్, షర్ఫీ, షఫీ, రహీమ్, వెంకటరామిరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

### 10న విజయవాడలో జాబ్‌మేళా

**ముదిగుబ్బ:** సుజనా ఫౌండేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణ భారత రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక, నేషనల్, ఇంటర్‌నేషనల్ కార్పొరేట్ కంపెనీల్లో దాదాపు మూడు వేల ఉద్యోగాలకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, పూర్తి వివరాలకు 70323 9948, 90004 12345 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## తల్లిపాల విశిష్టతను గుర్తించండి: ఎమ్మెల్యే



కుమ్మరవాండ్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి అర్బన్, ఆగస్టు 7:** తల్లిపాల విశిష్టత, ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో, కుమ్మరవాండ్లపల్లి సచివాలయంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తల్లిపాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడాయన్నారు. రేపటితరం వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేద్దుకు తల్లిపాలు చాలా ఉపయోగపడతాయన్నారు. సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానమన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వలన అమృతంలా పనిచేస్తుందన్నారు. అన్నిరకాల పోషకాలు అందుతాయన్నారు. శిశుమరణాలు తగ్గుతాయన్నారు. బిడ్డకు తల్లి పాలివ్వడం వలన ఆమె కూడా ఎంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హుస్సేన్, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, మోపూరిశెట్టి చంద్రశేఖర్, డైమండ్ ఇర్షాన్, ఎంపీటీసీ పుల్లయ్య, గంగులప్ప, ప్రేమలత, భార్గవ్ పాల్గొన్నారు.

**ఆర్థికసాయం:** తలుపుల మండలంలోని బట్రేపల్లికి చెందిన ఇద్దరు కూలీలు ఇటీవల పులివెందల సమీపంలోని నామాలగుండువద్ద రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరి రూ.లక్ష చొప్పన రెండులక్షలు ఆర్థికసాయం అందించారు. కుటుంబంలోని పిల్లలకు విద్యాభివృద్ధికి తనవంతుగా సాయం చేస్తానన్నారు.

**ఆలయానికి విరాళం:** తలుపుల మండలం మూలపల్లిలో శివాలయాభివృద్ధికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ.లక్ష బుధవారం విరాళం అందచేశారు. విరాళం అందచేసిన ఎమ్మెల్యేకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి, వైద్యసిబ్బంది

**పుట్టపర్తి రూరల్ ఆగస్టు 7:** తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా భాగంగా స్థానిక సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణంలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి వైజంక్షన్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి మంజువాణి తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, సీడీపీఓ గాయత్రి, సూపర్వైజర్లు పుష్పలత, కౌసల్య, భారతి, కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాకార్యాకర్తలు పాల్గొన్నారు.

**నల్లచెరువు:** మండల కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ గంగరత్నమ్మ, సూపర్‌వైజర్లు రహీమున్నిషా, లక్ష్మీదేమ్మ, జయమ్మ, పద్మవతి, కార్యకర్తలు సరస్వతి, పద్మావతి, సుజాత, మంజుల, పాతిమా పాల్గొన్నారు.

**ఓబుళదేవరచెరువు:** మండలంలోని గౌనిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ షమీమ్, ఆరోగ్య కార్యకర్త అశ్వనీ, ఆశకార్యకర్తలు, గర్భవతులు, బాలింతులు పాల్గొన్నారు.

**అమడగూరు:** ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి ఆధ్వర్యంలో కొట్టువారిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణకారులపై వేధింపులను అడ్డుకుంటాం

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: పరిటాల శ్రీరామ్



స్వర్ణకారులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

**ధర్మవరంరూరల్, ఆగస్టు 7 :** స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అంతర్రాష్ట్ర పోలీసుల వేధింపులు ఆపేలా చర్యలు తీసుకుంటామని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో స్వర్ణకారుల అసోషియేషన్ సభ్యులు పరిటాల శ్రీరామ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంతర్రాష్ట్ర పోలీసులు వేధింపులు స్థానిక స్వర్ణకారులపై తీవ్రమయ్యాయని, వారి బారి నుంచి తమను కాపాడాలని కోరారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. పాత బంగారు ఆభరణాలను స్థానికంగా ఉన్న గుర్తింపుగల వ్యక్తులతో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా అంతర్రాష్ట్ర పోలీసుల వేధింపుల నుంచి స్థానిక స్వర్ణకారులను రక్షించే విషయాన్ని మంత్రి సత్యకుమార్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

## ఉపాధి గ్రామసభ రసాభాస



టీడీపీ నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ వాగ్వాదం

**బత్తలపల్లి ఆగస్టు 7:** స్థానిక సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఉపాధి హమీ గ్రామసభలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉపాధి హమీ అధికారులు గ్రామంలో జరిగిన పనులను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సదాశివ, రమణ, శ్రీనివాసులు, పోతులక్క, పనులకు వెళ్లని వారిని ఎలా రికార్డుల్లో నమోదు చేసి.. డబ్బులు ఇచ్చారని ఇచ్చారని ప్రశ్నించారు. మండలవ్యాప్తంగా భారీగా అవినీతి జరిగినా సామాజిక తనిఖీ బృందం నిజాలు నిగ్గు తెల్చలేదని నిలదీశారు. అధికారులు మాట్లాడుతూ... ఆధారాలుంటే ఇవ్వాలని చెబుతుండగా ఫీల్డ్‌అసిస్టెంట్‌తో పాటు అతని అనుకుల వర్గీయులు జోక్యం చేసుకున్నారు. అడగాడానికి మీరెవరని వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామసభ రసాభాసగా మారింది. టీడీపీ నాయకులు మాట్లాడుతూ... ఉపాధి హమీలో అనర్హుల పేర్లు నమోదు చేసి ఉపాధి సిబంది భారీగా అవినీతికి పాల్పడ్డరని ఆరోపించారు. జరిగిన అవినీతినిపై మరోసారి విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదెప్ప, డీఆర్‌పీ బాలాజీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు జక్కంపూటి నాగభూషణ పాల్గొన్నారు.

## ఆటో బోల్తా - ఇద్దరికి గాయాలు

**తనకల్లు, ఆగస్టు 7:** మండల కేంద్రానికి సమీపంలో ఈతోడు రోడ్డులోని టవర్ వద్ద బుధవారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఈతోడుకు చెందిన రాజమ్మ, అక్షయ తీవ్రంగా గాయపడ్డారు. ఈతోడు గ్రామం నుంచి తనకల్లుకు ఈ ఆటో వస్తుండగా.. టవర్ సమీపంలో ఎదురుగా వేగంగా ఓ కారు వచ్చింది. కారును తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ ఆటోను పక్కకు తిప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన వారిని తనకల్లు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. బాలిక అక్షయకు కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వం తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా, తమకు సమాచారం లేదన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



అనుపమ



నాగరాజు



రంగనాయకులు

**పుట్టపర్తి రూరల్, ఆగస్టు 7** :పుట్టపర్తి తహసీల్దార్‌గా అనుపమ బుధవారం బాధ్య తలు చేపట్టారు. ఈమె కర్నూల్ జిల్లా సీ బెళగల మండలం నుంచి సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌కు మెజస్టీ రియల్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చి.. రెండేళ్ల విధులు నిర్వహించారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి తహసీల్దార్ వేణుగోపాల్ గాండ్లపెంటకు బదిలీ అయ్యారు.

**కొత్తచెరువు:** కొత్తచెరువు మండల తహసీల్దారుగా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకిరించారు. ఈయన గతంలో చిలమత్తూరు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడి తహసీల్దారు కళావతి బదిలీపై చిత్తూరుకు వెళ్లారు.

**నల్లమాడ :** తహసీల్దార్‌గా రంగనాయకులు బాధ్యతలు చేపట్టారు. ఇతను గోరంట్ల నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ నాగభూషణం కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు.

## పనిచేయని ఆధార్ సెంటర్లు



పనిచేయని ఐరిష్ యంత్రం

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 7:** స్థానిక, అల్లాపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు సాంకేతిక లోపం వలన కొద్ది నెలలుగా పని చేయడం లేదు. దీంతో ప్రజలు దీంతో గత్యంతరం లేక అమడగూరు, నల్లమాడ, కదిరి తదితర దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. స్థానిక సచివాలయంలో ఆధార్ కేంద్రమున్నా, మూడు నెలలుగా ఐరిష్ డివైజర్ పని చేయడం లేదు. దీని గురించి స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపినా.. ఇంతవరకు మరమ్మతులు చేయకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. అలాగే అల్లాపల్లి సచివాయంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి దాదాపు ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా అక్కడకూడా సాంకేతిక లోపంతోపాటు యంత్రాలు పని చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభంలో ఆన్‌బోర్డింగ్ ప్రాసెస్ చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రజలు 30 కిలోమీటర్లు వెళ్లి ఆధార్ తీయించుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓడీసీ, అల్లాపల్లిలో ఆధార్ యంత్రాలను మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించండి

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 7:** పండ్ల తోటల పెంపకం, ఉపాధి పథకం అనుసంధానం తదితర వాటిపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని బీజేపీ నాయకులు ఏపీఓ సుధాకర్‌ను బుధవారం విజ్ఞప్తి చేశారు. బీజేపీ తరఫున తమవంతుగా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ఎంపీ హరి, అశ్వర్థప్ప, యువమోర్చా జిల్లా కార్యదర్శి నరేష్, ఎస్సీసెల్ జిల్లా నాయకులు మారెప్ప పాల్గొన్నారు.

### చేనేత విగ్రహానికి నివాళి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**ధర్మవరం రూరల్, ఆగస్టు 7 :** చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మంత్రి సత్యకుమార్ యాదవ్ చేనేత సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, చేనేతల అభివృద్ధే బీజేపీ లక్ష్యమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో చేనేతలకు మంచి రోజులు రావడం ఖాయమ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీష్, అంబటి సతీష్, జింకా చంద్రశేఖర్, జయశ్రీ, గిర్రాజు నగేష్, గుండా పుల్లయ్య, సాకే ఓబిలేసు, గొట్లూరుచంద్ర, భక్తవత్సలనాయుడు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ల కేసులో నిందితుల అరెస్టు

**తాడిమర్రి ఆగస్టు 7:** ట్రాక్టర్లను లీజుకు తీసుకోని రైతును మోసం చేసిన కేసులో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ముదిగుబ్బ సీఐ క్రిష్ణంరాజు నాయక్, ఎస్ఐ నాగస్వామి తెలిపారు. గతంలోనే వీరి నుంచి 57 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోగా... ఇప్పుడు మరో ఎనిమిది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాగమల్లారెడ్డి, రామలింగేశ్వరరావు, మల్లికార్జునరెడ్డిని అరెస్టు చేశామని, వీరిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 7:** మండలంలోని ఉంట్లవారిపల్లిలో తాగునీటి పథకానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో రెండు తాగునీటి పథకాలున్నాయని, వాటిలో ఒక పథకానికి ఇటీవల విద్యుత్ సర్వీస్‌ను తొలగించారని, దీంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. విద్యుత్ సర్వీస్ తొలగించిన తాగునీటి పథకా నికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. 45ను సంప్రదించాలని సూచించారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

**కదిరి, (అమడగూరు) :** మండలంలోని గాజుపల్లిలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో ఓడీసీ మండలానికి చెందిన గోపీనాథ్, శారద దంపతుల కుమారుడు సాయియశ్వంత్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి పాల్గొన్నారు.

## వైభవంగా కొల్హాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గోపుర కలశస్థాపన చేస్తున్న రఘువీరారెడ్డి

**మడకశిర రూరల్, ఆగస్టు 7 :** మండలంలోని జీవీ పాళ్యం గ్రామంలో కొల్హాపురమ్మదేవి విగ్రహప్రతిష్ఠను గ్రామస్థుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులతో వేకువ జాము నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పాల్గొన్నారు. గోపుర కలశస్థాపన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సంఘవిద్రోహ శక్తుల ఆట కట్టిస్తాం: డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

**గోరంట్ల, ఆగస్టు 7:** సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని పెనుకొండ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పెనుకొండ డీఎస్పీగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం గోరంట్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సీఐ సుబ్బరాయుడు సెలవులో ఉండడంతో ఏఎస్ఐ మద్దిలేటితో కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లడుతూ... తనకు ఉమ్మడి జిల్లాతో బాగా పరిచయం ఉందని, నేరాలు అదుపు చేయడానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకెళతామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సీఐ రాజగోపాలనాయుడు

**హిందూపురం, ఆగస్టు 7:** స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా రాజగోపాలనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులును వీఆర్‌కు పంపారు. బదిలీల్లో భాగంగా తిరిపతి పీటీసీలో పనిచేస్తున్న రాజగోపాల్ నాయుడిని హిందూపురానికి పంపారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లా డుతూ... పట్టణంలో శాంతి భద్రతల విషయంలో రాజీ ఉండదన్నారు. అసాం ఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు నాయకులు, పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు.

## తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు పలువురు వారికి పోస్టింగ్ ఇచ్చిన మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిలమత్తూరు మండల తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్, లేపాక్షి తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, పరిగి తహసీల్దార్ హసీనాసుల్తానా, రొద్దం తహసీల్దార్‌గా నాగేంద్ర బాధ్యతలు చేపట్టారు. వారికి ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.

## మద్యం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

**గోరంట్ల, ఆగస్టు 7:** కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా కేసులో మండలంలోని పాపిరెడ్డిపల్లి వడ్డె కిష్టప్పకు పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో న్యాయాధికారి బొజ్జప్ప మూడేళ్ల జైలు శిక్ష, రూ.రెండు లక్షల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. 2020 జూలై 11న కర్ణాటక నుంచి వడ్డె క్రిష్టప్ప ద్విచక్రవాహనంపై 48టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తుండగా సీఐ జయనాయక్ అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. పెనుకొండ కోర్టులో 2021 జూన్ 30న పోలీసులు చార్జీషీటు వేశారు. వాదనల అనంతరం పెనుకొండ కోర్టులో న్యాయాధికారి బొజ్జప్ప శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థిని ఆచూకీ లభ్యం

**హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 7:** సోమందేపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని అనసూయ (13) ఆచూకీని బుధవారం పోలీసులు కనిపెట్టినట్టు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. తమ కుమార్తె మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదంటూ దుర్గానగర్‌కు చెందిన రామచంద్ర, సాలమ్మ బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టగా.. ముద్దిరెడ్డిపల్లిలోని బంధువుల వద్ద ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. విద్యార్థినిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**గోరంట్ల, ఆగస్టు 7:** మండలంలోని ఎగువగంగంపల్లికి చెందిన రేష్మా మనస్తాపానికి గురై బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎగువ గంగంపల్లికి చెందిన కుళ్లాయప్ప భార్య రేష్మ గ్రామంలో మరొకరి వద్ద అప్పు తీసుకుంది. అప్పు తీర్చాలని వారు నిలదీయడంతో మనస్తాపానికి గురైన మాత్రలను అధిక మోతాదులో మింగి అస్వస్థతకు గురైంది. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

## రైలుకింద పడి యువకుడి మృతి

**హిందూపురం, ఆగస్టు 7:** మండలంలోని కగ్గల్లు గ్రామానికి చెందిన గంగాధర్(23)అనే యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. కగ్గల్లుకు చెందిన హనుమంతరాయప్ప కుమారుడు గంగాధర్ తల్లి కొంతకాలం క్రితం మృతిచెందింది. దీంతో తండ్రి వేరే వివాహం చేసుకోగా.. గంగాధర్ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కగ్గల్లు రైల్వే గేటు సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

## దళితుడిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

● డీఎస్పీకి కేవీపీఎస్ నాయకుల వినతి

**పెనుకొండ, ఆగస్టు 7:** రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దళిత నారాయణను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. వారు బుధవారం డీఎస్పీ శ్రీనివాసులను పెనుకొండలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు.

## దున్నపోతు దాడిలో మహిళకు గాయాలు

**రొళ్ల, ఆగస్టు 7:** మండలంలోని మల్లినమడుగు గ్రామంలో బుధవారం సాయంత్రం కొల్హాపురమ్మ, మారమ్మ దేవతలకు వదిలిన దున్నపోతు పార్వతమ్మ అనే మహిళపై దాడి చేసి, గాయపరిచింది. గమనించిన స్థానికులు ఆమెను 108 వాహనంలో రొళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రొళ్లలో చికిత్స పొందుతోంది. మరో మహిళపై కూడా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. దున్నపోతును దేవస్థానానికి వదిలిన వారు దానిని నిర్బంధించి పోషించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వరినాట్లలో రైతులు బిజీ.. బిజీ..

**పెనుకొండ రూరల్, ఆగస్టు 7:** మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ బోర్ల కింద వరిసాగుచేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ బోరుబావుకింద రైతు బీపీటీ, సోనామసూరీ తదితర రకాల పైర్లు వేశారు. పొలాలను దుక్కి దున్నడం, వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ వారంలో వర్షాలు బాగా కురిస్తే తొలకరి వరినాట్లు మరింత వేగం పుంజుకుంటాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో వ్యవసాయ బోరుబావుల కింద వరినాట్ల పనులు ప్రారంభం కావడంతో పంట పొలాలన్నీ రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి.



వెంకటగిరిపాళ్యం వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

# రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



ట్రాన్స్‌ఫార్మర్లను వాహనాల్లోకి ఎక్కిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**అనంతపురం రూరల్/మడకశిర టౌన్, ఆగస్టు 7:** నియోజకవర్గంలో రైతుల సమస్యలను పరిష్కరించి వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రైతు సమస్యల పరిష్కారం కోసం అవసరమైన ట్రాన్స్ ఫార్మర్ల విషయమై ఆయన బుధవారం అనంతపురం జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌తో సమావేశమయ్యారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ల విషయమై ఎస్ఈతో చర్చించారు. ఎమ్మెల్యే దగ్గర ఉండి మడకశిర నియోజకవర్గానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను వాహనంలోకి ఎక్కించి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ రైతులు పడుతున్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. వారికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సర్వీసులను సకాలంలో అందించే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పంటలు ఎండకుండా లోటల్టేజీ సమస్య పరిష్కరించడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అధికారులతో చర్చించినట్లు తెలిపారు.

### ఐదేళ్ల నీటి సమస్యకు పరిష్కారం

**మడకశిర టౌన్:** నగరపంచాయతీ పరిధిలోని చీపులేటి సమీపంలో ఉన్న డ్రైవర్స్ కాలనీ వాసులు నీటి సమస్యతో ఐదేళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కాలనీలో మంగళ వా రం ఉదయం పర్యటించిన సందర్భంగా సమస్యను ఆయన దృష్టికి తీసుకె ళ్లారు. కాలనీలోని 98 ఇళ్లకుగాను 30 ఇళ్లలో ప్రస్తుతం నివాసం ఉంటున్నా రు. నీటి సమస్య వల్ల చాలామంది పట్టణంలోనే ఉంటున్నట్లు విన్న వించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామిని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో కొత్తగా బోరు వేశారు. బుధవారం ఉదయం మూడు ఇంచ్‌ల నీరు లభ్యమైనట్లు కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేకు, మాజీ ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీతోనే ప్రజాసంక్షేమం: నాయకులు



చిలమత్తూరులో ఎఫ్‌పీ షాపును ప్రారంభిస్తున్న జడ్పీటీసీ అనూష

**చిలమత్తూరు, ఆగస్టు 7:** ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని జడ్పీటీసీ అనూష, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి పేర్కొన్నారు. వారు బుధవారం మండల కేంద్రంలోని 36వ ఎఫ్‌పీ షాపును ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి నిత్యావసరాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, గౌరీశంకర్, వైస్ ఎంపీపీ బయప్ప, ఎంపీటీసీ నాగమణి, డీలర్ చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

**మడకశిరటౌన్:** పట్టణంలోని పావగడ రోడ్డులో 5వ నెంబర్ రేషన్ షాపును బుధవారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. టీడీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహ రాజు, పట్టణ అధ్యక్షుడు మనోహర్ తదితరులు షాపును ప్రారంభించారు. కౌన్సిలర్ ఉమాశంకర్, నాయకులు తిమ్మరాజు, ఫయాజ్, ఓంప్రకాష్, అసీదుల్లా, చిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థికి ఆరు బంగారు పతకాలు



గవర్నర్ నుంచి అవార్డు తీసుకుంటున్న రాము

**పావగడ, ఆగస్టు 7 :** తాలూకాలోని ఆంధ్ర, సరిహద్దు గ్రామమైన కేతగానిచెరువుకు చెందిన ముత్యాలప్ప, నరసమ్మ దంపతుల కుమారుడు రాముకు తుమకూరు యూనివర్సిటీ తరఫున రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ చేతులమీదుగా బుధవారం ఆరు బంగారు పతకాలను అందజే శారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రాము తుమకూరు యూనివర్సిటీలో కన్నడ ఎంఏ మొదటి సంవత్సరంలో మొదటి ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం బీఎడ్ చదువుతున్న రాము కేసెట్ నెట్‌లో ఉత్తీర్ణత పొంది మరిన్ని అవార్డులు సాధించాడు.

## కొండంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఈఈ



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఈఈ మురళి

**పెనుకొండ రూరల్, ఆగస్టు 7 :** మండలపరిధిలోని కొండంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పంచాయతీరాజ్ ఈఈ మురళి పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత గ్రామాన్ని గతంలో దత్తత తీసుకున్నారు. మంత్రి ఆదేశాలతో బుధవారం సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు. గ్రామంలో రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు, తదితర మౌలిక సదుపాయాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతామని ఈఈ, సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీఏ శ్రీనివాసులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దండి: డీపీఓ

**హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 7:** గ్రామాలను పరిశుభ్రంగా మార్చి స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించాలని డీపీఓ విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ, గ్రామ సచివాలయ కార్యదర్శులకు దిశ నిర్దేశం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధి లోని గ్రామాల్లో వందశాతం పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందేలా చూడాలన్నారు. అలాగే చెత్తతో సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలన్నారు. అందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించాలని సూచించారు.

### పారిశుధ్యంపై డీఎల్‌పీఓ సమీక్ష

**గోరంట్ల, ఆగస్టు 7:** మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పుట్టపర్తి డీఎల్‌పీఓ శివకుమారి అధికారులతో బుధవారం సమీక్షించారు. పీఆర్ -1 యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లు, క్లియరెన్స్ గురించి, ఇంటి పన్నుల వసూలు, పారిశుధ్యం తదితర విషయాల గురించి మండలంలోని గ్రామ కార్యద ర్శులతో సమీక్షించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్‌డీ సుధాకర్ పాల్గొన్నారు. గోరంట్లలోని పెట్రోల్ బంక్ వద్ద ఉంటున్న ఆదిలక్ష్మమ్మ, విద్యార్థి దిలీప్‌లో డెంగీ లక్షణాలతో హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. పంచాయతీ సిబ్బందితో అపరిశుభ్రతను తొలగించేలా చర్యలు చేపట్టారు. రావికుంటలోని డపింగ్‌యార్డును డీఎల్‌పీఓ పరిశీలించి, వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయించాలని ఆదేశించారు.

## విద్యార్థినులకు క్రీడాపోటీలు



గోరంట్లలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప

**గోరంట్ల, ఆగస్టు 7:** పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. గోరంట్ల, అమడగూరు మండలాల్లోని మొత్తం 11 పాఠశాలలకు చెందిన 145మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీలను ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప ప్రారంభించారు. అండర్ 14, 17, విభాగాలకు చెందిన వారికి పరుగుపందె, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర క్రీడల్లో పోటీలు జరిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎంఈఓ బహుమతులను ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చిలిచిన విద్యార్థినులు ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవం రోజు అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, వివిధ పాఠశాల పీడీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆర్డీటీ ఏటీఎల్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర రూరల్:** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా బాగా రాణించాలని ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, కల్లుమర్రి సర్పంచు గంగమ్మ, టీడీపీ క్లష్టర్‌ఇన్‌చార్జి నాగరాజు పేర్కొన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏరియా స్థాయి ఈ పోటీల్లో గెలుపొందిన వారు సెప్టెంబరు 2న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్ ఎం కృష్ణమోహన్, పీఈటీ ప్రకాశ్‌రెడ్డి ఉపాధ్యాయులు, ఆర్డీటీ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

### కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

**మడకశిర టౌన్:** ఆర్డీటీ ఆధ్వర్యంలో కల్లుమర్రిలో బుధవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మడకశిర కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో కే శశికళ మొదటి స్థానంలో నిలిచింది. లాంగ్‌జంప్‌లో ఆర్ దీక్ష మొదటి స్థానం, 600 మీటర్ల పరుగుపందెంలో ఎం మధుప్రియ ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో పి నవ్యశ్రీ రెండో స్థానంలో నిలిచారు. అదేవిధంగా 100 మీటర్ల పరుగుపందెంలో కస్తూరి మూడో స్థానంలో నిలిచి బహుమతులను అందుకొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు శశికళ, దీక్ష మధుప్రియలు ఎంపికైనట్లు పీఈటీ అనిత తెలిపారు.

## పాముల సయ్యాట

**మడకశిర రూరల్, ఆగస్టు 7:** మండలంలోని జమ్మానిపల్లిలో నాగేంద్రప్ప ఇంటి వెనుక బుధవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు రెండు నాగు పాములు పెనవేసుకున్నాయి. అది చూసిన గ్రామస్థులు ఆందోళన చేందారు. రెండు గంల పాటు ఎంతో ఆసక్తితో తిలకించారు.

పెనవేసుకున్న పాములు



## పురం అభివృద్ధిపై బాలయ్య దృష్టి

త్వరలో రూ.92కోట్ల నిధులు: కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



బురదమయమైన రహదారిని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

**హిందూపురం, ఆగస్టు 7:** నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని ఆటోనగర్, డ్రైవర్స్‌కాలనీలో మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ డ్రైవర్స్ కాలనీలో 200మందికిపైగా డ్రైవర్లకు పట్టాలు ఇప్పించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసి సమస్యలు వివరించారన్నారు. దీంతో బాలకృష్ణ సూచన మేరకు మునిసిపల్ అధికారులతో కలిసి ఇంటి గుత్తలేని ఇళ్లకు పన్ను కట్టించి, గుంతలుగా మారిన రోడ్లను త్వరలోనే మారుస్తామన్నారు. పట్టణ అభివృద్ధికి నెల లోపే రూ.92కోట్ల నిధులు మంజూరు కానున్నాయన్నారు. దీంతోపాటు హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో రహదారులు, కల్వర్టుల కోసం రూ.93కోట్లు నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని మునిసిపల్ మంత్రి నారాయణ, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. విద్యుత్‌దీపాలు, ఇంటింటికి కొళాయి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని మునిసిపల్ అధికారులకు శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, మునిసిపల్ డీఈ బాలసుబ్రహ్మణ్యం, జేఈ వెంకటస్వామి, కోరుముట్ల నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉర్దూ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి విద్యాసదస్సులు'

**గోరంట్ల, ఆగస్టు 7:** రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాల్లో ఉర్దూ విద్యా సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) అధ్యక్ష, కార్యదర్శులు ఇమామ్‌బాషా, సయ్యద్‌ఇక్బాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహమ్మద్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ప్రతిజిల్లాలో ఆగస్టు, సెప్టెంబరుల్లో విద్యా సదస్సులు నిర్వహిస్తామన్నారు. అక్టోబరులో రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుందన్నారు. తమ సమస్యలను విద్యా సదస్సుల ద్వారా వెలుగులోకి తెచ్చి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పరిష్కరించుకోవలన్నదే రూటా ఉద్దేశ్యమన్నారు.

## ఆరోపణలు అవాస్తవం: మాజీ జడ్పీటీసీ

**మడకశిర(అమరాపురం), ఆగస్టు 7:** కొంతమంది తనపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి తెలిపారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీప పుట్టినప్పటి నుంచి ఆ పార్టీలోనే ఉన్నానని, ఊపిరి ఉన్నంత వరకు ఇదే పార్టీలోనే కొనసాగుతానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తనకు డబ్బులు ఇచ్చారని ప్రచారం చేస్తున్నారు. వాటిని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

## చేనేతల బతుకుల్లో వెలుగులు నింపాలి

**హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 7:** చేనేతల బతుకుల్లో ప్రభుత్వం వెలుగులు నింపాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. సీపీఐ, సీపీఎం నాయకులు బాలస్వామి, రాజగోపాల్, చేనేతల సంఘం నాయకుడు నారాయణస్వామి, తొగటవీరక్షత్రియ సంఘం నాయకుడు సీసీహరి తదితరులు బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమందేపల్లిలోని ఎన్టీఆర్ కూడలిలో జెండా ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ శంకర్‌కు అందించారు.

## మొక్కలను నాటి.. సంరక్షిద్దాం

**లేపాక్షి, ఆగస్టు 7:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షి ంచాలని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ అన్నారు. ఆయన బుధవారం మండలం లోని చోళసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచేత మొక్కలు నాటించి, వాటి ప్రాముఖ్యత వివరించారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



## PUBLIC NOTICE

My client proposes to purchase the property more particularly described in the schedule here under from present owners **(1) SRI. SUGALI NAGE NAYAK,** aged about 50 years, son of Sri.Peere Nayak and **(2) SRI. MOODE KARTHIK KUMAR,** aged about 24 years, son of Sri. S Nage Nayak both are residing at No.2-627, RMS Colony,Ward No.2, Gorantla,Budili, Ananthapuram, Andhrapradesh -515 231. The owners represented that they have clear and marketable title to the Schedule Property. Any person/persons who claims any right, title or interest of any nature or any lien, charge or enforceable right in relation to the Schedule Property and/or has/have any objections of any nature to the transaction should lodge such claim and/or objections in writing to the undersigned together with supporting documents with in Ten (10) days hereof, failing which it will presumed that no validclaims or objections subsist and my client would proceed to complete the transaction with the present owners thereof subject to compliance with other statutory and legal formalities.

SCHEDULE PROPERTY

**(Lands which are owned by the SRI. SUGALI NAGE NAYAK)**

| Sl No | Survey Number | Extent |
|---|---|---|
| 1 | 961 | 3-00 Acre |
| 2 | 960/2 | 4-00 Acre |
| 3 | 960/2 | 1-00 Acre |
| 4 | 960/2 | 1-00 Acre |
| Total Extent | 9-00 Acre | |

**(Lands which are owned by the SRI. MOODE KARTHIK KUMAR)**

| Sl No | Survey Number | Extent |
|---|---|---|
| 1 | 960/2 | 1-00 Acre |
| 2 | 960/2 | 1-00 Acre |
| 3 | 960/2 | 3-00 Acre |
| 4 | 960/2 | 1-00 Acre |
| 5 | 959/3 | 3-00 Acre |
| 6 | 961 | 1Acre 82 Cents |
| 7 | 961-A | 1Acre 82 Cents |
| | Total | 13Acre64Cents |

The total extent of the lands mentioned in the Annexure — I and Annexure — II is measuring about 22 Acres 64 Cents, situated at Budili Village, Gorantla Mandalam, Sri Sathya Sai District, Andhra pradesh.

Sd/- **G.Rangaswamy** *Advocate*
No. 435, Balaji Gokula12th Main, 4th B Cross,West ofChord Road, Behind Kulkarni's Medzonne Rajajinagar 1st Block Bangalore 560 086.
**Mob: 98808 12716**

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

వారోత్సవాల్లో సీడీపీఓ

**పెనుకొండ రూరల్, ఆగస్టు 7 :** అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరమని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. రొద్ద మండలంలోని దొడగట్ట గ్రామ ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగిస్తే, బిడ్డకు రోగ నిరోధక శక్తి బాగా పెరుగుతుందన్నారు. అలాగే తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ, ఏఎన్ఎం శ్రీదేవి, మహిళా పోలీసు అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**హిందూపురం(సోమందేపల్లి):** తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ అనూరాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఏసీడీపీఓ గీతాబాయి, సూపర్‌వైజర్ సుధారాణి, యూనియన్ లీడర్ శ్రీదేవి, అంగనవాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అగళి/గుడిబండ:** తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని కోడిపల్లిలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ హెచ్‌పి లిఖిత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దొడగట్టలో మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి

అలాగే గుడిబండ మండలంలోని కేకుపాళ్యం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగనవాడీ కార్యకర్తలు వనితకుమారి, జగదాంబ, భాగ్యమ్మ, నూర్‌జహాన్, తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

**రొళ్ల/మడకశిర(అమరాపురం):** రొళ్ల మండలంలోని బీజీ హళ్లి పంచాయతీ మల్లసముద్రం గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నక్క, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, రత్నమ్మ, శివమ్మ, శారదమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే అమరాపురం మండల పరిధిలోని ఆలదపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం గాయత్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మలమ్మ, విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## సమర్థులను ఎన్నుకోండి

● టీడీపీ మండల కన్వీనర్

**గోరంట్ల, ఆగస్టు 7:** విద్యావంతులు, పాఠశాలాభివృద్ధికి దోహదపడే వారిని స్కూల్ కమిటీకి ఎన్నకోవాలని టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోరంట్లలోని పార్టీ కార్యాలయం లో పార్టీ మండలస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రస్తుతం స్కూల్ కమిటీలు నూతనంగా ఏర్పాటు చేస్తుండడంతో పార్టీ నాయకులు ప్రతిష్ఠాత్మంగా తీసుకుని పనిచేయాలని తెలిపారు. మంత్రి సవిత శుక్రవారం మంత్రిగా మొదటిసారి గోరంట్లకు వస్తుండడంతో ఆమెకు ఘన స్వాగతం పలకాలని తీర్మానించారు. గోరంట్ల, గౌనివారిపల్లి ప్రాంతాల్లో మంత్రి పర్యటిస్తుండడంతో పాలస ముద్రం జాతీయ రహదారి కూడలిలో ఉదయం స్వాగతస్తూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవానరసింహప్ప, అశ్వత్థరెడ్డి, నిమ్మల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.